క్లుప్తంగా

వారాడలో ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యసేవలు


వారాడలో వైద్య పరీక్షలను నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు : రక్తహీనత సమస్య బారిన పడకుండా గర్భిణులు, బాలింతలు పౌష్టిక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని లంకవానిపాలెం పీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ ప్రమీల అన్నారు. వారాడలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలను నిర్వహించారు. 176 మందికి సాధారణ వైద్య సేవలను అందించడంతో పాటు వడదెబ్బ బారిన పడకుండా ఆరోగ్య జాగ్రత్తలు తెలిపారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేసి ఐరన్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్‌ఎం కుమారి, ఎంఎల్‌హెచ్‌పీ సుమ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయిని పూజలు

నాతవరం : మండలంలో మర్రిపాలెం పంచాయతీ శివారు సిద్ధిపట్నం గ్రామంలో వెలసియున్న శ్రీదుర్గా మల్లేశ్వరిస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు సత్యనారాయణమూర్తి శర్మ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో దుర్గా మల్లేశ్వరస్వామికి, ఆంజనేయస్వామికి ఉదయం నుంచి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంలోకాత్యాయిని పూజలు నిర్వహించారు. వివాహం కావలసిన వారు, నిరుద్యోగులు, వ్యాపారులు, వివిధ సమస్యలపై ఇబ్బందులు పడేవారు భగవదనుగ్రహం కోరుతూ పూజల్లో పాల్గొన్నారు.

టీబీ రహిత గ్రామంగా కె.జె.పురం


ఎంఎల్‌హెచ్‌పీ లలితను సన్మానిస్తున్న ఎంపీటీసీ శ్రీనివాసరావు, సర్పంచ్ రమణబాబు

మాడుగుల రూరల్ : టీబీ రహిత గ్రామంగా కె.జె.పురం గ్రామ పంచాయతీ ఎంపిక కావడం, శుభపరిణామమని ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ జామి రమణబాబు అన్నారు. టీబీ రహిత పంచాయితీగా ఎంపిక కావడం వెనుక సచివాలయం ఎంఎల్‌హెచ్‌పీ లలితతో పాటు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తల కృషి ఎంతో ఉందని వారు కొనియాడారు. ఈ సందర్భంగా వారికి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి.నవీన్‌దొర, జూనియర్ సహాయకులు ఏడువాక సత్యనారాయణ, పంచాయతీ వార్డు సభ్యులు ఆడారి వెంకట సూరిప్పారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్‌బెల్ సమయంలో తప్పక నీరు తాగాలి


విద్యార్థులతో నీటిని తాగించే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు : వేసవికాలం కావడం వల్ల విద్యార్థులు తాగునీటిని ఎక్కువగా తీసుకోవడం ముఖ్యమని మండల విద్యాశాఖాధికారి డీవీడీ ప్రసాద్ అన్నారు. వారాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వాటర్‌బెల్ కార్యక్రమంపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా డీహైడ్రేషన్ బారిన విద్యార్థులు పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజు బడి నిర్వహణ సమయంలో ఉదయం 10, 11, 12 గంటల సమయంలో తప్పనిసరిగా ఉపాధ్యాయులు వాటర్‌బెల్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంఈవో సూచించారు.

పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవాలు


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న దృశ్యం

చీడికాడ : మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంగళవారం పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఉదయం నుంచి జి.కొత్తపల్లి, బైలపూడి, కోనాం, ఖండివరం, జైతవరం, ఎల్.బి.పట్నం తదితర గ్రామాల్లో రూ 3.30 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, గోకులం షెడ్లు, జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.2.42 కోట్లతో నిర్మించిన వ్యాటర్ ట్యాంకులు, పైపులైన్లకు ఎంపీపీ కురచా జయమ్మ నారాయణమూర్తితో కూడి శిలాఫలకాలు ఆవిష్కరించారు.


సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న దేవరాపల్లి మండల క్లాప్ మిత్రలు

కష్టాల సుడిగుండంలో
క్లాప్ మిత్రలు

తడి, పొడి చెత్త సేకరణకు మెటీరియల్ కొరత
ఆదివారం సైతం విధులు
అయినా సంక్షేమం పట్టని ప్రభుత్వం
అరకొర వేతనాలతో అవస్థలు
కనీస వేతనం రూ.12 వేలు అమలు చేయాలని డిమాండ్
చెత్త సంపద కేంద్రాల్లో కొరవడిన కనీస సౌకర్యాలు


రైవాడలో చెత్త సేకరిస్తున్న క్లాప్ మిత్రలు

దేవరాపల్లి : గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య విధులు నిర్వర్తిస్తున్న 'క్లాప్ మిత్ర'లు అరకొర వేతనాలతో అర్ధాకలితో అలమటిస్తున్నారు. గ్రామాలలో ప్రతీ ఇంటి నుంచి తడి చెత్త, పొడి చెత్తలను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించే క్లాప్ మిత్రలు కష్టాల సుడి గుండంలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామాల్లో పరిశుభ్రత, ప్రజారోగ్యం కోసం నిరంతరం కృషి చేసే క్లాప్ మిత్రల సంక్షేమంపై ప్రభుత్వ దృష్టి సారించకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. వారి ఆరోగాన్ని పణంగా పెట్టి ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న క్లాప్ మిత్రలు అవస్థలు వర్ణాతీతం. అసలే అరకొర వేతనం, అది కూడా సకాలంలో అందించక పోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారుతుందని క్లాప్ మిత్రలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం సైతం పని చేస్తున్నా వేతనాలు మాత్రం ఆరు నెలలకొకసారి ఇస్తే తామంతా ఎలా బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మూడు నెలల వేతనాలు అందించాల్సి ఉంది. ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో నెలకు రూ.6వేలు వేతనం ఏమాత్రం సరిపోవడంతో లేదని, ఈ అరకొర వేతనం కూడా ఎప్పుడిస్తారో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. దీంతో రోజంతా కష్టపడి పని చేస్తున్నా.. పూట వెల్లదీయడం కోసం పడరాని పాట్లు పడుతున్నారు. పెరిగిన నిత్యవసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 12 వేలు అందించాలని, అది కూడా ప్రతి నెలా అందించాలని క్లాప్ మిత్రలు డిమాండ్ చేస్తున్నారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు తడి, పొడి చెత్త సేకరణకు అవసరమైన మెటీరియల్ అందించాలని క్లాప్ మిత్రలు ముక్త కంఠంతో కోరుతున్నారు. ఒక్కో పంచాయతీలలో మూడు, నాలుగు నెలల చొప్పున బకాయిలు చెల్లించాల్సి ఉందని క్లాప్ మిత్రలు చెబుతున్నారు. కాగా దేవరాపల్లి మండలంలోని 27 పంచాయితీల పరిధిలో 63 మంది క్లాప్ మిత్రలు విధులు నిర్వర్తిస్తున్నారు.

కనీస వేతనం పెంచాలి



తమ ప్రాణాలను పణంగా పెట్టి నెలంతా శ్రమిస్తే రూ. 6వేలు వేతనం చెల్లిస్తున్నారు. అదీ ఎప్పుడిస్తారో తెలియదు. దీని కోసం కళ్లు కాయలు కాసేలా చూడాల్సిన పరిస్థితి. ప్రస్తుతం నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ఈ వేతనం ఏమాత్రం సరిపోవడం లేదు. అరకొర వేతనంతో పూట గడవక అర్ధాకలితో అలమటిస్తున్నాం. ప్రభుత్వం స్పందించి కనీస వేతనాన్ని రూ. 12 వేలు అందించాలి.

–బి.సముద్రం, క్లాప్ మిత్ర, కలిగొట్ల.

శ్రమకు తగ్గ ఫలితం ఏదీ...



ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పని చేస్తున్నా శ్రమకు తగ్గ వేతనం అందించడం లేదు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరించే సమయంలో దుర్వాసనతో తీవ్ర అనారోగాలు బారిన పడుతున్నాం. కనీసం చేతులు శుభ్రపరిచేందుకు సబ్బులు, నూనె ఇవ్వకపోవడం దారుణం. నెలకు రూ. 12 వేలు చొప్పున ప్రతీ నెలా వేతనం అందిస్తే తప్పా పనులు చేయలేము. అలాగే ప్రతీ ఆదివారం సెలవు ఇవ్వాలి.

–బల్లంకి లక్ష్మి, క్లాప్ మిత్ర, తిమిరాం

సకాలంలో వేతనాలు అందేలా చర్యలు



క్లాప్ మిత్రలకు పంచాయతీల ద్వారా సకాలంలో వేతనాలు అందేలా చర్యలు చేపడుతున్నాం. పారిశుధ్యం నిర్వహణలో క్లాప్ మిత్రలే కీలక పాత్ర. వారికి వేతనం పెంచే అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. క్లాప్ మిత్రల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. క్లాప్ మిత్రలకు అన్ని విధాలుగా అండగా ఉంటాం.

–ఎం.వి.సువర్ణరాజు, ఎంపీడీవో, దేవరాపల్లి

ఉపాధి మేట్‌లకు మాజీ సర్పంచ్ టార్పాలిన్‌ల వితరణ


ఉపాధి మేట్‌లకు టార్పాలిన్‌లు పంపిణీ చేస్తున్న కుసర్లపూడి మాజీ సర్పంచ్ గండి తాతాజీ

రోలుగుంట : కుసుర్లపూడిలో కేసర్లవాని చెరువులో ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం కింద చెరువు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇక్కడ 25 జట్లకు చెందిన ఉపాధి కూలీలు జట్టుకు 50 మంది చొప్పున అధిక సంఖ్యలో ఉపాధి పనుల్లో పాల్గొన్నారు. ఎండలు అధికంగా కాయడం, ప్రభుత్వం వీరికి ఏ విధమైన నీడనిచ్చే టార్పాలిన్‌లు సరఫరా చేయకపోవడం వల్ల వృద్ధ కూలీలు మండుతున్న ఎండ తట్టుకోలేక ఇక్కట్లు పడుతున్నారు. ఈ సమస్యను చూసి మాజీ సర్పంచ్ గండి తాతాజీ చలించారు. తన సొంత నిధులతో ఒక్కో టార్పలిన్‌కు రూ.600 చొప్పున 25 జట్ల మేట్‌లకు సుమారు 15వేల విలువ గల టార్పాలిన్‌లను మంగళవారం పని ప్రదేశానికి తీసుకెళ్లి పంపిణీ చేశారు. మేట్‌లు, కూలీలు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

70 మందికి కంటి వైద్యపరీక్షలు

మాకవరపాలెం : ఉచిత కంటి వైద్య శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బూరుగుపాలెంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ఈ గ్రామంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి 70 మంది హాజరుకాగా వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. మరికొందరికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించారు. కార్యక్రమంలో వైద్యుడు, వివేక్, నిర్వాహకుడు కె.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కుబడిగా కార్పొరేషన్ రుణాల ఇంటర్వ్యూలు


దేవరాపల్లిలో కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

దేవరాపల్లి : బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూల ప్రక్రియ మొక్కుబడిగా సాగింది. స్థానిక ఎంపీడీవో సువర్ణరాజు నేతృత్వంలో వివిధ బ్యాంక్ అధికారుల సమక్షంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థుల నుంచి విద్యార్హత, కుల,ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో కూడిన మూడు సెట్ల దరఖాస్తులను బ్యాంక్‌ల వారీగా తీసుకున్నారు. కేవలం దరఖాస్తులు స్వీకరించడం తప్ప ఏ యూనిట్ కోసం దరఖాస్తు చేశారు, తదితర వివరాలను అధికారులు సేకరించలేదు. దీంతో రుణాలకు అర్హుల ఎంపిక ఏ ప్రాతిపదికన చేపడతారోనని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు బ్యాంక్ అధికారులదే తుది నిర్ణయమని అధికారులు చెప్పడంతో పారదర్శకతపై అభ్యర్థులు మరింత అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మండలానికి 91 యూనిట్స్ కేటాయించగా, వీటికి 816 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు మండల వ్యాప్తంగా 359 మంది మాత్రమే హాజరయ్యారు. ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకున్న వారిలో సగం మంది కూడా ఇంటర్వ్యూలకు హాజరు కాక పోవడం గమనార్హం.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో మేరీ సువార్త


అవగాహన ర్యాలీలో పాల్గొన్న సీడీపీవో శ్రీదేవి అంగన్‌వాడీ కార్యకర్తలు

నర్సీపట్నం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్త పేర్కొన్నారు. 7వ పౌష్టికాహార పక్షోత్సవాలను మంగళవారం వేములపూడి పంచాయతీ కేంద్రంలోని అంగనవాడీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఈ పక్షోత్సవాలు ఈ నెల 22 వరకు జరుగుతాయన్నారు. ఈ 15 రోజుల పాటు అన్ని అంగనవాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సు, పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పక్షోత్సవాలను నిర్వహిస్తున్నాయన్నారు. లబ్ధిదారులు స్వయంగా తమంతట తామే పోషన్‌ట్రాకర్‌లో నమోదు చేసుకునే విధానంపై అవగాహన కల్పించాలని, పిల్లల్లో పౌష్టికాహారం లోపం నివారణపై దృష్టి సారించాలని అన్నారు. జెడ్పీటీసీ రమణమ్మ మాట్లాడుతూ పౌష్టికాహారం తినడం వల్ల రక్తహీనత దరి చేరదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకాలమ్మ, సూపర్‌వైజర్ రమణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు జ్యోతి, రేవతి పాల్గొన్నారు.

చీడికాడ : మండలంలో కోనాం అంగన్‌వాడీ కేంద్రం -1లో మంగళవారం పోషణ్ మాసోత్సవాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐసీడీఎస్ పీవో సీహెచ్ శ్రీదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతిరోజు నాలుగు అంశాలపై అవగాహన కల్పించి, ప్రతి అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఐదు ఫొటోలు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పోతల చిన్నమ్ములు, అంగన్‌వాడీ ఆశా కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

పాచిలవానిపాలెంలో ఘనంగా సీతారాముల కల్యాణం


కోలాటం మహిళలకు చీరలు అందిస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, పరశురాం గురువు


పాచిలవానిపాలెంలో సీతారాముల కల్యాణ మహోత్సవం జరుపుతున్న గ్రామస్తులు

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామస్తులు సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా జరిపారు. ప్రతి ఏటా చైత్రశుద్ధ ఏకాదశి పర్వదినం రోజున సీతారాముల కల్యాణం జరపడం ఈ గ్రామస్తుల ఆనవాయితీ. సీతారాముల కల్యాణాన్ని పాచిల త్రినాథరావు, స్వాతి, బొంతు సత్తిబాబు, రమణమ్మ దంపతులు నిర్వహించారు. మధ్యాహ్న ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన జరిపారు. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, గండి సత్యనారాయణ, సిరపరపు రమణారావు, రొంగలి నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కోలాటం ప్రదర్శన ఇస్తున్న 30 మంది మహిళలకు రొంగలి పరశురాం గురువు చీరలను అందించారు.

కిరాణాషాపులో రూ.50వేలు చోరీ


బాధితుడి వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

మాడుగుల : మండలంలో ఘాట్‌రోడ్ జంక్షన్, పాడేరు రోడ్డులో ఒక కిరాణా దుకాణంలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. షాపు యజమాని అద్దేపల్లి కొండలరావు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నారాయణరావు మంగళవారం సాయంకాలం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌ఐ అందించిన కథనం మేరకు గుర్తు తెలియని వ్యక్తులు షాపు వెనుక నుంచి తాళాలు పగుల గొట్టి షాపులో ఉన్న రూ.50 వేలు నగదు దొంగిలించుకు పోయారన్నారు. కొండలరావు అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎస్‌ఐ తెలిపారు.

పేకాడుతున్న 9 మందిపై కేసు నమోదు

గొలుగొండ : మండలంలో కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో లింగంపేట వద్ద సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్టు కృష్ణదేవిపేట ఎస్‌ఐ తారకేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి 9 మందిని పట్టుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5300 స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు.

కేజీబీవీలో ఖాళీలకు దరఖాస్తులు

మాకవరపాలెం: కస్తూర్బా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌వో త్రివేణి తెలిపారు. భీమబోయినపాలెం వద్ద ఉన్న కస్తూర్బా పాఠశాలలో ఆరో తరగతికి 40 సీట్లు, ఇంటర్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో చేరేందుకు 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 11 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

నాతవరం : మర్రిపాలెం కస్తూర్బా పాఠశాలలో 2025, 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.భవాని కోరారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరం 40 సీట్లు, 6వ తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అలాగే 7,8,9,10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల వారంతా ఈనెల 11వ తేదీ సాయంత్రంలోగా దరఖాస్తు చేయాలని, ఇతర వివరాలకు 9666801458, 9505455172 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఉపాధి పనులకు భూమి పూజ


కొత్తకోటలో భూమి పూజ చేస్తున్న సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ

రావికమతం : జాబ్‌కార్డ్ కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ అడిగిన వెంటనే ఉపాధి పనులు కల్పించాలని కొత్తకోట సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవ కోరారు. మండలంలో కొత్తకోట శివారు మర్రివలస వేళ్లే దారిలో గల బంద చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం పనులకు మంగళవారం భూమి పూజ చేశారు. వేసవి దృష్ట్యా నీడ, మంచినీరు ఏర్పాటు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోట నీలవేణి గోవిందరావు పాల్గొన్నారు.

హామీల అమలుపై పోరుబాటకు సిద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి


సభలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

నర్సీపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఏరు దాటాక తెప్ప తెగలేసినట్టు ఉందని, ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పోరుబాటకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. సీపీఐ రెండవ మహాసభ గబ్బాడలో మాకిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ కేంద్రంలో రెండుసార్లు అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశం సర్వనాశనమైందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు పరం చేయడానికి ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలోనే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని వాగ్దానం అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పరిపాలన కొనసాగించడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, అమ్మకు వందనం, రైతు భరోసా వంటి హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు డిసిహెచ్. క్రాంతి, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, సీనియర్ నాయకులు పి.గంగాభవాని, మాకిరెడ్డి రాజుబాబు పాల్గొన్నారు.

12న బాలాంజనేయస్వామి తీర్థం

- హనుమాన్ శోభాయాత్ర,
- బైటో భజన పోటీలు

మాడుగుల రూరల్ : కె.జె.పురం గ్రామంలో గల శ్రీ బాలాంజనేయస్వామి తీర్థం ఈ నెల 12వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ వారు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. అదే రోజు హనుమాన్ జయంతి సందర్భంగా స్వామి వారి తిరువీధి శోభాయాత్ర జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి ఆలయం వద్ద బైటో భజన పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.8వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు, తృతీయ బహుమతిగా రూ.4వేలు, నాలుగో బహుమతిగా రూ.3వేలు, ఐదో బహుమతిగా రూ. 2వేలు, ఆరో బహుమతిగా రూ.1500, ఏడో బహుమతిగా రూ.1000, ఏనిమిదో బహుమతిగా రూ.800, అందజేస్తారన్నారు. పోటీల్లో పాల్గొనే వారు విధిగా ఒక జట్టుకు రూ.200 నామినేషన్ ఫీజు ఈ నెల 11వ తేదీ లోపు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు 7036018164, 9052186334, 7661873880 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయం వద్ద అన్న సమారాధన ఉంటుందన్నారు.

పెంచిన గ్యాస్ ధర వెంటనే తగ్గించాలి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు



నిరసన వ్యక్తం చెస్తున్న సీపీఎం నేతలు

నర్సీపట్నం : వంట గ్యాస్ ధర పెంపుదల చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పార్టీ నాయకులు ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ మధ్య తరగతి సామాన్యులపై ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరగడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై రూ.50, పెంచిందన్నారు. ప్రధాని మోదీ అధికారంలోకి రాకముందు డీజిల్ పెట్రోల్ రూ.63 ఉండేవని, వంట గ్యాస్ రూ.450 ఉండేదని కానీ బీజేపీ అధికారంలోకి వచ్చాక గ్యాస్ రూ.900 అయిందని, పెట్రోల్ రూ.110 పెరిగిందన్నారు. రోజురోజుకీ ప్రజలపై భారాలు పెంచుకుంటూ రావడం దుర్మార్గమన్నారు.

చీడికాడ : పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని సీపీఎం ఆధ్వర్యంలో కోనాం శివారు కొండ్లకొత్తూరులో వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆర్.దేముడునాయుడు మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర ధరలు పెరుగుదలతో ఇబ్బంది పడుతున్న సామాన్యులపై గ్యాస్ బండపై రూ. 50 పెంచడం తగదన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు నాలుగేళ్ల కనిష్టానికి చేరుకున్నా ధరలు పెంచడం తగదన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని ఆయన కోరారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరి రాయితీలు పొందండి


కుముదాంపేటలో అధ్యాపకుల ప్రచారం

బుచ్చెయ్యపేట : ప్రభుత్వ కాలేజీలో చేరి పలు రాయితీలు పొందాలని వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. మంగళవారం వడ్డాది కాలేజీకి చెందిన అధ్యాపకులు ఇ.నరసింహమూర్తి, శ్రీనివాస్, ముత్యాలమ్మ, నారిబాబులు కుముదాంపేట, భీమవరం తదితర గ్రామాల్లో కాంపెయినింగ్ నిర్వహించారు. పదో తరగతి పాసైన విద్యార్థుల ఇంటికెళ్లి వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్‌లో చేరాలని మీకు ఉన్నత విద్య అందిస్తామని భరోసా కల్పించారు. కాలేజీలో మధ్యాహ్న భోజనంతో పాటు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్ ఉచితంగా అందిస్తామన్నారు. తొలిరోజు పది మంది విద్యార్థులు కాలేజీలో జాయిన్ అవడానికి ముందుకొచ్చారని, ప్రతి రోజూ పలు గ్రామాల్లో కాంపెయినింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు.